క్లుప్తంగా

కమ్యూనికేషన్ స్కిల్స్‌ను డెవలప్ చేసుకోండి



తెనాలిఅర్బన్: కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అందరూ డెవలప్ చేసుకోవాలని ఎన్ఆర్ఐ విద్యాసంస్థల సీఈవో సి.హెచ్.ఉమామహేశ్వరరావు సూచించారు. అమెరికన్ కంపెనీ వారి ఆధ్వర్యంలో తెనాలిలోని ఎన్ఆర్ఐ డిగ్రీ కళాశాలలో వారం రోజులుగా నిర్వహిస్తున్న క్యాంపస్ రిక్రూట్‌మెంట్ పై శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. కంపెనీ ప్రతినిధులు 20 టీంలుగా విభజించి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ప్రతిభ చూపిన ముగ్గురికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.లాజర్‌బాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, స్కూల్ ప్రిన్సిపల్ కిషోర్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి చేయూత



నగరంపాలెం: జిల్లాలో హోంగార్డు పని చేస్తున్న వై.అక్కేశ్వరరావు గతేడాది డిసెంబర్ 12న అనారోగ్యంతో మృతి చెందారు. జిల్లాలోని హోంగార్డుల ఒక రోజు వేతనం రూ.2.37 లక్షల చెక్కుని అతడి భార్య ప్రమీలకు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ తుషార్ డూడీ అందించారు. కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ స్వర్ణలత, ఆర్ఎస్ఐ కృష్ణయ్య, ఏఎస్ఐ చంద్రశేఖర్, హోంగార్డ్ ఎన్‌సీఓ అధికారులు పాల్గొన్నారు.

థైరాయిడ్ లోపంతో మహిళల్లో పలు సమస్యలు



గుంటూరు మెడికల్: థైరాయిడ్ లోపంతో మహిళల్లో పలు సమస్యలు తలెత్తుతాయని మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ వి.వి. రామ్‌కుమార్ తెలిపారు. వరల్డ్ థైరాయిడ్ డే సందర్భంగా శనివారం స్థానిక కొత్తపేటలోని ఎస్వీఆర్ షుగర్ హాస్పిటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ షుగర్ వ్యాధి ఉన్న పది నుంచి 30 శాతం మందికి థైరాయిడ్ హార్మోను తక్కువ ఉత్పత్తి అవుతుందని తెలిపారు. ఈ సమస్య మహిళల్లో ఎక్కువగా ఉంటుందని, దీనివల్ల షుగర్ కంట్రోల్ కష్టమవుతుందని పేర్కొన్నారు. షుగర్ ఉన్నవారు థైరాయిడ్ పరీక్ష చేయించుకుంటే మంచిదని ఆయన సూచించారు. థైరాయిడ్‌లోపం వల్ల గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు, సంతానలేమి, షుగరు కంట్రోల్ కాకపోవడం ఇతర అనర్థాలు తలెత్తుతాయన్నారు. థైరాయిడ్ తగ్గిపోతే నీరసం, అలసట, బద్ధకం డిప్రెషన్, మలబద్ధకం, ఆహారం ఎక్కువ తినకపోయినా బరువు పెరగడం, అల్ప రక్తపోటు, పల్స్ రేటు తగ్గిపోవడం లక్షణాలు ఉంటాయని ఆయన వివరించారు.

శాసనాలలో మన సంస్కృతి నిక్షిప్తం



నగరంపాలెం: శాసనాల అధ్యయనం ద్వారా మన భాష, సంస్కృతి, మూలాలు తెలుస్తాయని లేమల్లెపాడు ఎంటీఎస్ ఉపాధ్యాయుడు మోదుగుల రవికృష్ణ అన్నారు. స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయ ఆవరణలో శనివారం అమరావతి అమరేశ్వరాలయ శాసనాల సంపుటి 'అమరేశ్వరం' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంపుటిలో ఉన్న 38 శాసనాల ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉండే పలు ప్రాంతాలు, వెయ్యేళ్ల కిందట ఉమ్మడి జిల్లా రాజులు, వారి ప్రతినిధులు, ఉద్యోగులు ఇచ్చిన దానాలు మొదలైన విషయాలన్నీ తేటతెల్లంగా తెలుస్తాయని అన్నారు. సభకు అరసం ఏపీ రాష్ట్ర కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అధ్యక్షత వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ కె.ప్రఫుల్లరాణి పుస్తకావిష్కరణ చేయగా, ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ భూసురాపల్లి వెంకటేశ్వర్లు, ఆర్.సాంబశివరావు, కోటేశ్వరప్రసాద్, కందిమళ్ల శివప్రసాద్, కె.శివరెడ్డి, నాగరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

క్షతగాత్రులకు ఆసరా... ఎంఆర్ఐ స్కానింగ్

- పీపీ పద్ధతిలో తెనాలి జిల్లా వైద్యశాలలో 25 సంవత్సరాల క్రితం ఏర్పాటు
- ఇప్పటి వరకు ఉపయోగించుకున్న 13 వేల మంది రోగులు

మేగ్నటిక్ రిసోనెన్స్ ఇమేజింగ్ (ఎంఆర్ఐ) స్కానింగ్ యూనిట్ పాతిక సంవత్సరాలుగా తెనాలి ప్రభుత్వాస్పత్రిలో రోగులకు విశేష సేవలు అందిస్తోంది. రోగుల శరీరంలో ఎక్కడైనా గడ్డలు, కండరాల సమస్యలు, మెదడులోని సమస్యలు, మల్టీపల్ స్క్లారసిస్, వెన్నుపూస సమస్యలు వంటి వాటిని ఎలాంటి ఆపరేషన్ లేకుండా దీనిద్వారా చూడవచ్చు. దాదాపుగా ఇప్పటి వరకు 13 వేల మంది వరకు దీని సేవలు పొందినట్లు యంత్రాంగం చెబుతోంది.

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ఎంఆర్ఐ స్కానింగ్ సేవలను ఎక్కువ మంది పేదలు ఉపయోగించుకుంటున్నారు. దీనిని జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసి 25 సంవత్సరాలు దాటింది. అప్పటినుంచి ఇప్పటి వరకు సుమారు 13 వేల మంది రోగులు ఉపయోగించుకున్నారు. ఉమ్మడి జిల్లాలోనే గుంటూరు తర్వాత అతిపెద్ద వైద్యశాలగా తెనాలి జిల్లా వైద్యశాలకు పేరుంది. వైద్యశాల ఏర్పాటు చేసిన నాటి నుంచి పాలకులు, ఉన్నతాధికారులు దాని సేవలు విస్తరిస్తు వస్తున్నారు. 200 పడకలతో ఏర్పాటు చేసిన దీనిలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వార్డు, డయాలసిస్ వార్డు వంటి వాటిని అదనంగా ఏర్పాటు చేశారు. అలాగే ఆస్పత్రి ఆవరణలో 100 తల్లి పిల్లల వైద్యశాలను ఏర్పాటు చేశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు 2019 మార్చి 27న జిల్లా వైద్యశాలలో ఎంఆర్ఐ స్కానింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు.

పీపీ పద్ధతిలో ఎంఆర్ఐ యూనిట్ ఏర్పాటు

తెనాలి జిల్లా వైద్యశాలలో ప్రవేట్ భాగస్వామ్యం (పీపీ) పద్ధతిలో ఎంఆర్ఐ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. యూనిట్ ఏర్పాటు బాధ్యతను ఎన్ఆర్ఐ వైద్యశాలకు ప్రభుత్వం అప్పగించింది. దీంతో వారు వైద్యశాల ఆవరణలోనే ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతను ఎన్ఆర్ఐ వైద్యశాల చూస్తుంటుంది. టెక్నీషియన్‌లను కూడా సంస్థే సమకూర్చుతుంది. స్కాన్ రిపోర్టులను కూడా ఎన్ఆర్ఐ వైద్యశాలలోని రేడియాలజీ విభాగం వారే ఆన్‌లైన్ ద్వారా పంపుతుంటారు. ఎంఆర్ఐ సేవలను ఉపయోగించుకున్న 12 వేల మంది.



స్కానింగ్ కోసం వేచి ఉన్న రోగులు (ఫైల్)

రోడ్డు ప్రమాదాలు జరిగి తలకు గాయాలై అపస్మారక స్థితికి చేరుకుంటే వాటి తీవ్రతను తెలుసుకునేందుకు ఎంఆర్ఐ ఎంతో ఉపయోగపడుతుంది. సీటి స్కాన్‌లో గాయాలలోని కొంత తీవ్రతే



స్కానింగ్ చేస్తున్న ఉద్యోగి (ఫైల్)

తెలిసే అవకాశం ఉంది. అదే ఎంఆర్ఐలో అయితే తలలోని ప్రతి నరం ఏ స్థితిలో ఉందో తెలుసుకునే వెసులుబాటు ఉంది. అలాగే పక్షవాతం, కీళ్ల సమస్యలతో బాధపడే వారికి ఎంఆర్ఐ స్కాన్ అవసరం, వెన్నుపూస, మెదడు సమస్య వంటి వాటిని తెలుసుకోవాలన్న ఎంఆర్ఐతోనే సాధ్యం. దీనిని దృష్టిలో ఉంచుకుని అధికారులు తెనాలి జిల్లా వైద్యశాలలో ఎంఆర్ఐ స్కానింగ్ సేవలు ఏర్పాటు చేసి పేద రోగులకు దాని సేవలు చేరువ చేశారు.

తెనాలి, మంగళగిరి, రేపల్లె, పొన్నూరు నియోజకవర్గాలకు చెందిన పేదలు ఎక్కువ మంది దీని సేవలు ఉపయోగించుకుంటున్నారు. దీనిని తెనాలిలో ఏర్పాటు చేసిన తర్వాత రోజుకు సగటున 15 నుంచి 20 మంది, నెలకు 450 నుంచి 500 మంది ఉపయోగించుకుంటున్నారు. 25 సంవత్సరాలలో ఇప్పటి వరకు 13 వేల మందికి దీని సేవలు ఉపయోగించుకున్నారని అధికారులు తెలిపారు.

ఉచితంగా చేస్తున్నారు



నేను కీళ్ల నొప్పులతో బాధపడుతున్నా. అప్పుడప్పుడు తూలు వచ్చి పడిపోతున్నా. వైద్యులను సంప్రదిస్తే ఎంఆర్ఐ స్కానింగ్ చేయించుకోవాలని సూచించి ఓపీ చీటిపై రాశారు. ఇక్కడి సిబ్బంది నాకు ఎంఆర్ఐ స్కానింగ్ చేసి కొద్ది గంటలోనే రిపోర్టును ఇచ్చారు. ఉచితంగా ఎంఆర్ఐ స్కానింగ్ చేయడం వలన ఆర్థిక భారం తగ్గింది.

–సి.హెచ్.మాధవి, దుగ్గిరాల

సేవలు భేషుగ్గా ఉన్నాయి



జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ఎంఆర్ఐ స్కానింగ్ మాలాంటి పేదలకు ఎంతో ఉపయోగకరంగా మారింది. నాకు వయస్సు మీద పడటం వలన ఫిట్స్ వస్తున్నాయి. నిలబడలేకపోతున్నాను. వైద్యులు ఎంఆర్ఐ స్కానింగ్ రాశారు. దాని ఆధారంగా మందులు ఇచ్చారు. ఇక్కడి సేవలు బాగున్నాయి.

–ఎం.యజ్ఞ నారాయణ, చినరావూరు తోట, తెనాలి

నేడు క్రికెట్ సెలక్షన్స్

తెనాలిరూరల్: ఏపీ యూత్ టీ–20 క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం క్రికెట్ జట్టు ఎంపిక జరుగుతుందని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎంఎస్ భాస్కర్‌గౌడ్ శనివారం తెలిపారు. పట్టణ చెంచుపేటలోని ఆర్‌పీఎం క్లబ్‌లో యువ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో క్రీడాకారులను ఎంపిక చేస్తారని, ఎంపికైన జట్టు వచ్చే నెల 8, 9 తేదీల్లో జరుగనున్న నేషనల్ క్యాష్ ప్రైజ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు 7989215572 నంబరులో సంప్రదించాలన్నారు.

ఎన్నికల కమిషన్ నిరాకరించడం తగదు



లక్ష్మీపురం: పార్లమెంట్, నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్ల సమాచారాన్ని ఎన్నికల కమిషన్ నిరాకరించడం సరైంది కాదని అవగాహన సంస్థ సభ్యులు విమర్శించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం 'ఎన్నికల కమిషన్ – విశ్వసనీయత' అంశంపై సమావేశం నిర్వహించారు. ఏపీ లీగల్ ఫోరం కన్వీనర్ అవధానుల హరి మాట్లాడుతూ ప్రజాస్వామ్య ప్రక్రియలో అతి కీలకమైన పోలింగ్ సమాచారాన్ని వెల్లడించడంలో ఎన్నికల కమిషన్ మీనమేషాలు లెక్కించడం దేశ ప్రతిష్టకు భంగకరమని తెలిపారు. మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి మాట్లాడుతూ ఓటింగ్ వివరాలు వెల్లడిపై ఈసీని ఆదేశించలేమని సర్వోన్నత న్యాయస్థానం ప్రకటించడం ప్రజాస్వామ్యశక్తులకు తీవ్ర నిరాశ కలిగించిందని చెప్పారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ రామారావు, సింగరయ్య, సదాశివరావు పాల్గొన్నారు.

కాశీ విశ్వనాథుడికి చిన్నారుల నృత్యనీరాజనం

సంగీత నృత్యోత్సవంలో ప్రదర్శన

తెనాలి: తెనాలి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాశీలో శనివారం ఉదయం జరిగిన కాశీ విశ్వనాథుని సంగీత నృత్యోత్సవంలో తెనాలి చిన్నారులు కూచిపూడి నృత్యాంశాలతో అభినందనలు అందుకున్నారు. భారత్ ఆర్ట్స్‌అకాడమీ, కాశీ విశ్వనాథ టెంపుల్ ట్రస్ట్ ఫ్యాకల్టీ ఆఫ్ పెర్ఫార్మెన్స్, బెనారస్, హిందూ యూనివర్సిటీ, వారణాసి సంయుక్త ఆధ్వర్యంలో ఈ సంగీత నృత్యోత్సవాన్ని ఏర్పాటుచేశారు. తెనాలికి చెందిన ప్రముఖ నృత్యగురువు డాక్టర్ చల్లా బాల త్రిపుర సుందరి శిష్యబృందం 21 మంది కాశీ విశ్వేశ్వర స్వామి సన్నిధిలో చక్కటి నృత్యాంశాలతో ఆ నటరాజుకి నృత్యాభిషేకం చేసుకున్నారు

తొలుత బాల శిష్య బృందం అంబ ప్రార్థనతో ఆరంభించారు. మొదటి అంశంగా ఆనంద నర్తన గణపతి ప్రార్థనను అయిదుగురు విద్యార్థులు ప్రదర్శించారు. రెండో అంశంగా ఆనందతాండవం అనే అంశంలో చలమలశెట్టి మహతి, సంస్కృతి, వలివేటి మోక్షిక, తుమ్మల ప్రణతి యశస్విని. గీతికా షణ్ముఖ నర్తించారు. తదుపరి శివతాండవం, నాలుగో అంశంగా శివస్తుతి ప్రదర్శించారు. చివరగా డాక్టర్ చల్లా బాలా త్రిపుర సుందరి 'మహిషాసుర మర్దని' ప్రదర్శించి అందరి



నృత్యోత్సవం అనంతరం అతిథులతో తెనాలి చిన్నారులు

మన్ననలను పొందారు. ముఖ్యఅతిథులుగా కాశీ విశ్వనాథ టెంపుల్ ట్రస్ట్ సీఈవో విశ్వ భూషణ్ మిశ్రా, ట్రస్ట్ బోర్డ్ మెంబర్ డాక్టర్ బ్రిజ్‌భూషణ్ ఓజా, బెనారస్ హిందూ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ సంగీత పండిట్, యూనివర్శిటీ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ శశికుమార్, తెలుగు డిపార్ట్‌మెంట్, అధిపతి డాక్టర్ బూదాటి వెంకటేశ్వర్లు, కాశీ విశ్వనాథ మందిర్ అర్చక్ డాక్టర్ శ్రీకాంత్ మిశ్రా, ప్రముఖ సంగీత విద్వాంసురాలు/ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సుచిత్ర హొల్లా హాజరయ్యారు. నృత్యగురువు బాలత్రిపురసుందరికి 'మంజీర నాట్యం' అవార్డును ప్రదానం చేసి, శిష్యబృందాన్ని జ్ఞాపికలు, సర్టిఫికెట్లతో సత్కరించారు.

ఆహ్వానం లక్ష్మి వారసత్వాన్ని నిలుపుకోవటం అవసరం

ప్రథమ వర్ధంతి సభలో ప్రముఖ కథా రచయిత, విమర్శకుడు పాపినేని శివశంకర్

తెనాలి: సాహిత్య పత్రికా నిర్వహణలో ఉన్నత విలువలను పాటించిన ఆహ్వానం లక్ష్మి వారసత్వాన్ని నిలుపుకోవటం అవసరమని ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ అన్నారు. ఈ క్రమంలో భిన్నస్వరాలు ఆధ్వర్యంలో ఆహ్వానం లక్ష్మి సంస్మరణార్థం నెలనెలా మంచి పుస్తకంపై సమీక్షను నిర్వహించటం అభినందనీయమని చెప్పారు. పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక వేదిక భిన్నస్వరాలు ఆధ్వర్యంలో ఆహ్వానం లక్ష్మిగా చిరపరిచితులైన ఎస్.ఎస్.లక్ష్మి ప్రథమ వర్ధంతి సభను శనివారం రాత్రి ఇక్కడి కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటుచేశారు. జీఎస్ నాగేశ్వరావు అధ్యక్షత వహించారు. పాపినేని శివశంకర్ మాట్లాడుతూ సంజీవదేవ్ స్ఫూర్తితో సాహితీ యాత్రను ఆరంభించిన లక్ష్మి, సాహిత్య సంస్కారం, అభిరుచితో కొనసాగించటం గొప్ప విషయమన్నారు. కత్తిమీద సాములాంటి సాహిత్య పత్రిక నిర్వహణకు తన సొంత ఆస్తిని విక్రయించారని గుర్తుచేశారు. మరో ప్రముఖ కవి, రచయిత బండ్ల మాధవరావు తన ప్రసంగంలో అప్పట్లో కవిత్వం రాయటం ఆరంభించిన తనను, ఆహ్వానం లక్ష్మి సాహిత్య విమర్శ, పుస్తక సమీక్షల వైపునకు ప్రోత్సహించినట్టు చెప్పారు. ప్రముఖ కథారచయిత్రి, కవి వాడ్రేవు వీరలక్ష్మీదేవి మాట్లాడుతూ ఆహ్వానం



మాట్లాడుతున్న పాపినేని శివశంకర్. వేదికపై బండ్ల మాధవరావు, నాగేశ్వరరావు, వీరలక్ష్మీదేవి

లక్ష్మితో తన జ్ఞాపకాలను పంచుకున్నారు. సాహిత్యంతో జీవితం గడిపిన లక్ష్మి, ఆ రంగంలోని ఉత్తములతోనే అనుబంధం కొనసాగిస్తూ, మిగిలిన ప్రపంచంతో ఆసక్తి లేనట్టుగా ఉండేవారని స్మరించుకున్నారు. కథా రచయిత కాట్రగడ్డ దయానంద్ మాట్లాడుతూ ఆహ్వానం లక్ష్మి తన పత్రికతో చాలామంది కవులు, రచయితలకు దారిచూపారని చెప్పారు. ఆమె రాసిన సంపాదకీయాల విశిష్టతను వివరించారు.

సాహిత్యంలో నిష్కామకర్మ చేసిన ఆహ్వానం లక్ష్మి తనకుగా ఎన్నడూ గుర్తింపును కోరుకోలేదని చెప్పారు. భిన్నస్వరాలు బాధ్యుడు, కవి జుగాష్ విలి పర్యవేక్షించిన సభలో సమయం రాజా సంజీవదేవ్, ప్రముఖ సాహితీ విమర్శకుడు బి.తిరుపతిరావు, రచయిత్రి నల్లూరి రుక్మిణి, శ్రీశ్రీ ప్రింటర్స్ విశ్వేశ్వరరావు, మొవ్వా సత్యనారాయణ, వేమూరి విజయ భాస్కర్, కనపర్తి బెన్‌హర్ తదితరులు పాల్గొన్నారు.

తొలిసారిగా వీఏ ఎక్మో చికిత్స

యువకుడి ప్రాణాలు కాపాడిన రమేష్ హాస్పిటల్

గుంటూరు మెడికల్: ఏపీలో మొట్టమొదటిసారిగా వీఏ ఎక్మో చికిత్స ద్వారా హార్ట్ ఎటాక్‌కు గురైన యువ ఇంజినీర్‌ను కాపాడినట్లు గుంటూరు ఆస్టర్ రమేష్ హాస్పటల్ వైద్య బృందం వెల్లడించింది. శనివారం గుంటూరులోని హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రామారావు వివరాలు వెల్లడించారు. ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గా పనిచేస్తున్న 35 సంవత్సరాల యువకుడు రెండు వారాల కిందట మంగళగిరిలోని గుడికి వెళ్లి ఛాతి నొప్పితో స్థానిక ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నట్లు తెలిపారు. మంగళగిరి వైద్యులు ఈసీజీ నిర్వహించి హార్ట్ ఎటాక్ వచ్చినట్లుగా నిర్ధారించి వెంటనే గుండె జబ్బులు వైద్యం అందించే హాస్పిటల్‌కి వెళ్లమని సూచించారన్నారు. గుంటూరులో ఉన్న ఫ్యామిలీ ఫిజిషియన్ దగ్గరికి వెళ్లగా ఆయన కొన్ని పరీక్షలు చేసి తీవ్రమైన గుండెపోటుగా నిర్ధారించి ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ కు రిఫర్ చేసినట్లు వెల్లడించారు. ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేసి గుండె పంపింగ్ తగ్గిపోవడం, కార్డియోజెనిక్ షాక్, పల్మనరి ఎడిమా వంటి క్లిష్టమైన పరిస్థితులు ఉన్నట్లు నిర్ధారించామని తెలిపారు. రోగికి వెంటనే వెంటిలేటర్ అమర్చి క్యాథ్ ల్యాబ్‌కు తరలించి యాంజియోగ్రాం పరీక్ష చేయగా గుండెకు రక్తాన్ని అందించే ప్రధాన రక్తనాళం నూరు శాతం రక్తపు గడ్డలతో పూడిపోయి ఉండటాన్ని గమనించామని చెప్పారు. వెంటనే ఎమర్జెన్సీ యాంజియోప్లాస్టీ చికిత్స ద్వారా రక్తపు గడ్డలను తొలగించామని వివరించారు. యువకుడి ప్రాణాలు కాపాడిన వైద్య బృందాన్ని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు అభినందించారు. హాస్పిటల్స్ డెప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమత రాయపాటి పాల్గొన్నారు.

డబ్ల్యూహెచ్ఓ నిబంధనల ప్రకారమే ఆపరేషన్లు

గుంటూరు మెడికల్: కాటూరి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ), ఎఫ్ఓజీఎస్ఐ నిబంధనల మేరకే గర్భిణులకు సిజేరియన్లు చేస్తున్నామని డీన్ డాక్టర్ కె.ఎస్.వరప్రసాద్, ప్రసూతి విభాగ అధిపతి డాక్టర్ బి. వెంకటేశ్వరావురావు తెలిపారు. తమ బోధనాసుపత్రికి పేద,మధ్య తరగతి, గ్రామీణ ప్రాంత ప్రజల ఎక్కువగా వస్తున్నట్లు వెల్లడించారు. చాలా క్లిష్టమైన కాన్పులు కోసం, గతంలో సిజేరియన్ చేయించుకున్న వారు వస్తున్నారని పేర్కొన్నారు. ఆపరేషన్లు కూడా ఉచితంగా చేస్తున్నామని తెలిపారు. ఆసుపత్రి ద్వారా అనేక రకాల పథకాల కింద గర్భిణులు, కాన్పు అయిన మహిళలకు వైద్య సహాయం ఉచితంగా అందిస్తున్నామని ఆయన వెల్లడించారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవు



తెనాలిరూరల్: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ జి. దశరథరామారావు స్పష్టం చేశారు. మరికొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో పట్టణంలోని ఆరుపేట, రామలింగేశ్వరపేట గురవయ్య కాలనీలో శనివారం రాత్రి ఆయన స్థానికులతో మాట్లాడారు. ఎన్నికల కేసుల్లో ఇరుక్కుంటే జీవితాంతం ఇబ్బంది పడాల్సి ఉంటుందని చెప్పారు. అవసరమైతే సస్పెక్ట్ షీట్‌లు తెరుస్తామని హెచ్చరించారు. ఎన్నికల సందర్భంలో అలజడులు రేగకుండా చర్యలు తీసుకున్నామని, కౌంటింగ్ సందర్భంగా ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. అలానే టూ టౌన్ సీఐ ఎ. సుధాకర్ తన సిబ్బందితో కలిసి టూ టౌన్ సర్కిల్ పరిధిలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతం నిఘా ఉంచామని, అసాంఘిక శక్తులను ఉపేక్షించేది లేదని తెలిపారు. కౌంటింగ్ ముగిసే వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.

తెనాలిలో అన్నమాచార్యుల సంకీర్తన గానం



అన్నమాచార్యుల చిత్రపటానికి పూజలు చేస్తున్న రమణయ్య, శ్రీనివాసరావు



సంకీర్తనలు ఆలపిస్తున్న శారద చలపతి, అనురాధ

తెనాలిఅర్బన్: శ్రీమాన్ శ్రీశ్రీ తాళ్ళపాక అన్నమాచార్యులు 616వ జయంతి వారోత్సవాల్లో భాగంగా శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నాజర్‌పేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలో శనివారం అన్నమాచార్యుల సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవా ట్రస్ట్ కో–ఆర్డినేటర్ కారంపూడి రమాదేవి వృద్ధులకు అన్నదానం చేసి పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. ముందుగా అన్నమాచార్యుల చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కొండపి శ్రీనివాసరావు, అందె బాలచంద్రమౌళి, లక్ష్మీ రజిని, భారతి, మురళి, తదితరులు పాల్గొన్నారు.

- తాళ్ళపాక అన్నమాచార్యులు 616వ జయంతిని పురస్కరించుకుని సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నందులపేటలోని వినాకయ ఆలయ ప్రాంగణంలోని రామ మందిరంలో అన్నమాచార్యుల సంకీర్తనల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధి కడియాల సునీల్ కుమార్ మాట్లాడుతూ వెంకటేశ్వరస్వామి భక్తితో తనే స్వయంగా కీర్తనలు రాసి, సంగీతం సమకూర్చి పాడిన వాగ్గేయకారుడిగా అన్నమాచార్యులు నిలిచారని తెలిపారు. స్వామివారి ఆశీస్సులను పొందినట్లు చెప్పారు. అనంతరం అన్నమాచార్యుల సంకీర్తనలను ఆలపించారు. కార్యక్రమంలో వి.లక్ష్మీ సునీత, దీపాల మహేష్, శారద చలపతి, అనురాధ, రాజ్యలక్ష్మి, సుశీల, విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధి రామాంజనేయులు, ఆలయ నిర్వాహకులు గోపీచంద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైన్ షాపులో రూ. 1.50 లక్షల చోరీ

మంగళగిరి: పట్టణంలోని జాతీయ రహదారి వెంటగల ప్రభుత్వ వైన్ షాపులో నగదు చోరీ జరిగిన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. పట్టణ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... కొప్పురావూరుకాలనీ జాతీయ రహదారి వెంటగల ప్రభుత్వ వైన్‌షాపులో సిబ్బంది శుక్రవారం రాత్రి వరకు విక్రయించగా వచ్చిన రూ. 1.50 లక్షలను కౌంటర్‌లో ఉంచి తాళాలు వేసి వెళ్లారు. శనివారం మరలా తెరిచేందుకు రాగా షట్టర్ల తాళాలు పగులగొట్టి ఉన్నాయి. కౌంటర్‌లోని నగదు కూడా మాయమైంది. దీంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో షాపు సూపర్‌వైజర్ నక్కా గోపి ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీషీటర్లపై నిఘా

మండలంలో అల్లర్లు జరగకుండా రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఉత్సవాలు నిర్వహించరాదని సూచించారు. ఊరేగింపులు, బాణసంచా కాల్చినా, కవ్వింపు చర్యలు చేపట్టినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లకు ప్రతిరోజూ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

వైభవంగా వీరాంజనేయుని పల్లకీ ఉత్సవం

జంపని(వేమూరు): మండలంలోని జంపని గ్రామంలో వేంచేసియున్న శ్రీ వీరాంజనేయస్వామి వారి దేవస్థానంలో నిర్వహించిన వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా శని సువర్చలా సహిత వీరాంజనేయస్వామి వారి పల్లకీ ఉత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. వేద పారాయణ నడమ భక్తుల హరే రామ నామ సంకీర్తన మధ్య పల్లకీ ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. సమ్మెట బసవేశ్వరరావు దంపతులు ఉత్సవాన్ని నిర్వహించారు.

తక్కువ వడ్డీకే గృహ, వాహన రుణాలు

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ జవహర్



రిటైల్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న క్రెడాయ్ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి, యూబీఐ రీజనల్ హెడ్ జవహర్, అశ్వర్థ

కొరిటెపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అతి తక్కువ వడ్డీ రేటుతో గృహ, వాహన రుణాలు అందిస్తోందని బ్యాంకు గుంటూరు రీజనల్ హెడ్ ఎస్.జవహర్ తెలిపారు. స్థానిక నగరంపాలెంలోని ప్రాంతీయ కార్యాలయంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'రిటైల్ ఎక్స్‌పో–2024' శనివారం జరిగింది. ఈ సందర్భంగా బ్యాంకు రీజనల్ హెడ్ జవహర్ మాట్లాడుతూ ఖాతాదారుల సౌకర్యార్థం యూనియన్ బ్యాంకు సేవలను మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు. రూ.40 లక్షల వరకు కొల్లేటరల్ లేని విద్యా రుణాలు అందిస్తోందన్నారు. అనంతరం పలువురికి గృహ, వాహన, విద్యా రుణాల మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో క్రెడాయ్ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి, బ్యాంక్ డిప్యూటీ రీజనల్ హెడ్ అశ్వర్థ నాయక్, రిటైల్ లోన్ పాయింట్ హెడ్ రామాంజనేయ కుమార్, పలువురు బ్రాంచి మేనేజర్లు, నగరంలోని బిల్డర్లు, కారు డీలర్లు, ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీలు పాల్గొన్నారు.